www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 28 మే 2025 | 5 | ఏలూరు



ఉద్యోగోన్నతికి ధ్రువపత్రాల పరిశీలన

ఏలూరు అర్బన్ : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో ఉన్న ఏలూరు, పశ్చిమగోదావరి, రాజమండ్రి జిల్లాల్లో ఉన్న అన్ని జిల్లా పరిషత్, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యాల పాఠశాలల్లో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు (గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతి పొందేందుకు సీనియార్టీ జాబితా ప్రకారం మంగళవారం సత్రంపాడులోని సిద్ధార్థ విద్యాలయ పాఠశాలలో ధ్రువపత్రాల పరిశీలన జరిగింది. జిల్లా పరిషత్ యాజమాన్యంలో సీనియార్టీ జాబితా 282 మందికి 241 మంది హాజరై ధ్రువపత్రాల పరిశీలన చేయించుకున్నారు. మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యంలో 22 మందికి 17 మంది హాజరై ధ్రువపత్రాల పరిశీలన చేయించుకున్నారు. ధ్రువపత్రాల పరిశీలన కోసం మంగళవారం హాజరు కాని జిల్లా పరిషత్ యాజమాన్యంలో 41 మందికి, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యంలో ఐదుగురికి ఈ నెల 28వ తేదీ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో పరిశీలన ఉంటుందని డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు.

కరోనా కలవరం..!

- ఏలూరులో ఇద్దరికి కరోనా పాజిటివ్
- విజయవాడలోని ప్రయివేటు ఆసుపత్రిలో ఆరోగ్య టెస్టులు చేయగా నిర్ధారణ
- కుటుంబ సభ్యులకు టెస్టులు చేయగా నెగిటివ్ వచ్చినట్లు సమాచారం
- ఏలూరు సర్వజన ఆసుపత్రిలో పది బెడ్లతో ప్రత్యేక వార్డు
- విఆర్‌డిఎల్ ల్యాబ్, ఆక్సిజన్ సిలిండర్లు ఏర్పాటు
- 'పశ్చిమ'లో తణుకు ప్రయివేటు ఆసుపత్రిలో కరోనా కేసు అంటూ ప్రచారం
- ఖండించిన జిల్లా వైద్యశాఖ అధికారి గీతాబాయ్



ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా ప్రజానీకాన్ని కరోనా కలవరపెడుతోంది. రెండు జిల్లాల్లో మంగళవారం కరోనా కేసులు నమోదుపై పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. దీంతో రెండు జిల్లాల ప్రజానీకం ఒక్కసారిగా ఉలిక్కిపడిన పరిస్థితి నెలకొంది. 2020లో వచ్చిన కరోనా పరిస్థితులను మరోసారి గుర్తుచేసుకుని ఆందోళన చెందుతున్న పరిస్థితి నెలకొంది. కరోనా కేసుల నమోదుపై జరుగుతున్న ప్రచారాన్ని రెండు జిల్లాల వైద్యశాఖ అధికారులు ఖండించారు. ఏలూరులోని శాంతినగర్‌కు చెందిన భార్య, భర్తలకు విజయవాడ ప్రయివేటు ఆసుపత్రిలో కరోనా నిర్ధారణ అయినట్లు తెలియడంతో ఏలూరు నగర ప్రజలు ఒక్కసారిగా కలవరపాటుకు గురయ్యారు. దీనిపై ఆరోగ్యశాఖ అధికారులు మాట్లాడుతూ ఐదు రోజుల క్రితం ఆరోగ్య టెస్టుల కోసం విజయవాడ ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లిన భార్య భర్తలకు కరోనా లక్షణాలు కనిపించడంతో చికిత్స తీసుకుంటున్నారని, వారి ఆరోగ్యం బాగానే ఉందని తెలిపారు. వెంటనే శాంతినగర్‌లో ఆ కుటుంబం ఇంటికి వైద్యశాఖ సిబ్బందిని పంపించడం సైతం జరిగిందని అక్కడ ఎవరిలోనూ అధికారులు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లిన వ్యక్తికి కరోనా అంటూ ప్రచారం సాగింది. దీనిపై ఆ జిల్లా వైద్యశాఖ ఆరోగ్యశాఖ అధికారులు స్పందిస్తూ జ్వరం తదితర లక్షణాలు ఉన్నాయని ఏలూరులోగానీ, విజయవాడలోగానీ పరీక్ష చేయించుకోవాలని ఆసుపత్రి వైద్యులు సూచించడం మాత్రమే జరిగిందని, కరోనా కేసులు ఏమీ నమోదు కాలేదని తెలిపారు. ఆ ఆసుపత్రిలో కరోనా టెస్టులకు సంబంధించి ఎటువంటి పరికరాలు లేవని తెలిపారు. దీంతో జనం ఊపిరిపీల్చుకున్నారు. దేశవ్యాప్తంగా కరోనా కేసులు పెరుగుతున్నట్లు అధికారిక ప్రకటనలు చెబుతున్నాయి. దీంతో మరోసారి జనంలో కరోనా ఆందోళన నెలకొంది. ఇప్పటికే జనం మాస్కు వేసుకోవడం, జాగ్రత్తలు తీసుకోవడం వంటివి ప్రారంభించారు. కరోనా కేసుల నమోదుపై జరుగుతున్న ప్రచారం జనాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ప్రత్యేక ఏర్పాట్లు..

దేశ వ్యాప్తంగా కరోనా కేసులు నమోదవుతున్నట్లు తేలడంతో జిల్లా అధికారులు ముందుగానే అప్రమత్తమయ్యారు. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ఇప్పటికే పది బెడ్లతో ప్రత్యేక వార్డు సైతం ఏర్పాటు చేశారు. అవసరాన్ని బట్టి మరిన్ని చర్యలు తీసుకునే విధంగా చర్యలు చేపడుతున్నారు. కరోనా అనుమానితులకు టెస్టులు నిర్వహించేందుకు విఆర్‌డిఎల్ ల్యాబ్‌తోపాటు, ఆక్సిజన్ సిలిండర్లు సైతం ఏర్పాటు చేసినట్లు సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ పి.సావిత్రి తెలిపారు. మంగళవారం జ్వరం, జలుబుతో ఉన్న ఒక మహిళకు కరోనా టెస్ట్ చేయడం జరిగిందని, నెగిటివ్ వచ్చిందని సూపరింటెండెంట్ తెలిపారు. ఇప్పటి వరకూ కరోనా కేసులు ఏమీ నమోదు కాలేదన్నారు. పశ్చిమలోనూ ముందుగానే కరోనాకు సంబంధించిన ఏర్పాట్లు చేసిన పరిస్థితి నెలకొంది.

అవగాహన చర్యలపై దృష్టిపెట్టాల్సిందే..

దేశ వ్యాప్తంగా కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు దానిపై మరోసారి అవగాహన కల్పించాల్సి ఉంది. మాస్క్ ధరించడం, చేతులు కడుక్కోవడం, శానిటైజేషన్ పాటించడం, ఆహార నియమాలపై మరోసారి ప్రజలకు అవగాహన కల్పిస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. కరోనా కేసులపై జిల్లా అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాల్సి ఉంది.

వాళ్లు ఇక్కడలేరు..

ఆర్.మాలిని, డిఎంఅండ్‌హెచ్‌ఒ, ఏలూరు

ఏలూరు శాంతినగర్‌లో కరోనా వచ్చినట్లు చెబుతున్న వ్యక్తులు ప్రస్తుతం ఇక్కడలేరు. గత ఐదు రోజుల క్రితమే విజయవాడలోని ప్రయివేటు ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోగా భార్య భర్తలకు కరోనా లక్షణాలు కనిపించాయని చికిత్స తీసుకున్నారు. ఇప్పుడు ఆరోగ్యం బాగానే ఉంది. జిల్లాలో ఎక్కడా కరోనా కేసులు నమోదు కాలేదు. ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

స్వచ్ఛ ఓటర్ల జాబితాకు సహకరించాలి

ప్రజా ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం



ప్రజా ప్రతినిధులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి కోరారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరంలో గుర్తింపుపొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రతి నియోజకవర్గంలోని పోలింగ్‌స్టేషన్‌కు బూత్ లెవల్ అసిస్టెంట్లను నియమించాలని తెలిపారు. దీనిపై అన్ని రాజకీయ పార్టీలు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు. ఎన్నికల సమయంలోనే కాకుండా ముందుగానే ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ, మార్పులు, చేర్పులు, ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాధనలు వంటి అంశాలపై చర్యలకు భారత ఎన్నికల సంఘం ఆదేశించిందని తెలిపారు. ఈ మేరకు ఆయా రాజకీయ పార్టీలు తమ సూచనలు, సలహాలు అందించాలని కోరారు. నియోజకవర్గ పరిధిలో పనిచేస్తున్న బిఎల్‌ఒలు సెలవులు గానీ, ప్రమోషన్లు గానీ, బదిలీపై వెళితే సదరు వివరాలు ఎఇఆర్‌ఒ, ఇఆర్‌ఒలకు తెలియజేస్తే వారి స్థానాల్లో ఇతరులను నియమించి తప్పులులేని ఓటర్ల జాబితాను తయారు చేసేందుకు వీలుపడుతుందన్నారు. దొంగఓటర్ల నమోదుకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకోవాలని టిడిపి ప్రతినిధి బాలానందం కోరారు. సమావేశంలో డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పి.ఆదిశేషు (సిపిఎం), సిర్రా భరత్, ఎ.రతన్ కాంత్ (బిఎస్‌పి), వి.సత్యంబాబు, బత్తుల ప్రభాకరరావు, (వైసిపి), నెరుసు నెలరాజు (బిజెపి), ఎస్.బాబూ ప్రసాద్ (ఐఎన్ సి), మోరు వెంకట నాగరాజు(జెఎస్‌పి) పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవలో అర్హులైన రైతులను గుర్తించాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

అన్నదాత సుఖీభవ వథకంలో అర్హులైన రైతుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, అనుబంధ రంగాలు, జాతీయ ఉపాధి హామీ, తదితర అంశాలపై సంబంధిత శాఖల జిల్లా, మండలస్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ జూన్ నుంచి అమలు జరిగే అవకాశం ఉన్నందున, అర్హులైన రైతుల జాబితాలను మండలాల వారీగా ఈ నెలాఖరులోగా రూపొందించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అన్నదాత సుఖీభవ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుచేయడం ద్వారా ఏలూరు జిల్లా జిడిపిని పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో కోకో, మామిడి, ఆక్వా, తదితర ఉత్పత్తులకు సంబంధించి జిల్లాలో 100 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందని తెలిపారు. ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్స్‌తో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించి, జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపనకు అనువైన అంశాలు, జిల్లాలో లభించే పంట ఉత్పత్తులు, ప్రభుత్వం అందించే ప్రోత్సాహం, బ్యాంకుల ద్వారా రుణాలు, సంబంధిత శాఖల ద్వారా అందించే సాంకేతిక సహకారం వంటి అంశాలను ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్స్ లో సభ్యులైన రైతులకు తెలియజేసి, నిర్దేశించిన సమయంలోగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ చట్టంలో పని అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని, వేతనాల పద్దులో ఎక్కువ పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో అర్హులైన ప్రతి కౌలుదారుడికీ రుణ అర్హత కార్డులు జారీ చేయాలని, బ్యాంకుల నుండి పంట రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ హబీబ్ భాష, ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామ్మోహన్, డ్వామా పీడీ సుబ్బారావు, వ్యవసాయ, ఉద్యానవన అధికారులు పాల్గొన్నారు.

ఎక్కువ పని దినాలే లక్ష్యం..!

జిల్లాలో విజయవంతంగా ఉపాధి హామీ చట్టం

రోజుకు వేతనం రూ. 290 వరకూ వచ్చేటట్టుగా ముందుకు

ప్రోగాం ఆఫీసర్లు మస్తర్లు తనిఖీ చేయాలని ఆదేశాలు

డ్వామా పీడీ వెంకట సుబ్బారావు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం విజయవంతంగా నిర్వహించబడుతోందని, ఎక్కువ పని దినాలు కల్పించడమే లక్ష్యంగా ప్రణాళికతో పనిచేస్తున్నామని డ్వామా పీడీ వెంకట సుబ్బారావు తెలిపారు. మంగళవారం స్థానిక డ్వామా కార్యాలయంలో జిల్లాలో ఉపాధి హామీ చట్టం అమలు తీరును ఆయన పాత్రికేయులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గతేడాది కోటీ 20 లక్షల పని దినాల లక్ష్యానికి కోటి 23 లక్షల 65 వేల పనిదినాలు కల్పించి 103 శాతం పైగా వృద్ధిని సాధించామన్నారు. గతంలో ఉపాధి హామీ వేతనం సరాసరి రూ.300 కాగా దాన్ని ప్రభుత్వం రూ.307లకు పెంచిందన్నారు. ఈ మేరకు గతేడాది రూ.300 వేతన సరాసరికి జిల్లాలో రూ.253కు సాధించామని, ఈఏడాది పెరిగిన సరాసరి వేతనానికి అనుగుణంగా కనీసం రూ.290 తగ్గకుండా వేతనం కల్పించి ఉపాధిహామీపై మరింత నమ్మకం కలిగేలా చర్యలు చేపట్టామన్నారు. ఉపాధి హామీలో ఏప్రిల్, మే నెలల్లో నిర్వహించిన పనులకు సంబంధించి ప్రస్తుతం రూ.280 సరాసరి వేతనం చెల్లించినట్లు తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు ఇకపై ఉపాధి హామీ కూలీలకు బదులు ఉపాధి శ్రామికులుగా పేర్కొనడం జరుగుతుందన్నారు. వేసవి కాలంలో ఎక్కువ పనులు చేసేందుకు అవకాశం ఉన్నందున ఏప్రిల్, మే, జూన్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో పనులు ఎక్కువ చేపట్టడం జరిగేలా ప్రణాళిక చేశామన్నారు.

ఉద్యానవన పంటల విస్తరణకు ప్రణాళికాబద్ధంగా ముందుకు..

ఉద్యాన పంటల విస్తరణకు సంబంధించి గతేడాది 3,150 ఎకరాలే లక్ష్యాంగా తీసుకున్నట్లు తెలిపారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ సూచన మేరకు ఐదెకరాలు, ఆలోపు చిన్న, సన్నకారు రైతులకు సంబంధించి ఉద్యాన పంటలకు ఉపాధి హామీ అనుసంధానం చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. గతేడాది ఉపాధి హామీ పనులు ఎక్కువ చేపట్టడం మూలంగా శ్రామికులు పనిచేయడంతో రూ.200 కోట్లు మెటీరియల్ కాంపౌండ్ కింద జిల్లాకు లభించిందన్నారు. ఆ నిధులతో జిల్లాలో సిసి, బిటి రోడ్లు, పశువుల షెడ్లు, తదితర పనులు ఎక్కువ చేసుకోవడం జరిగిందన్నారు. ఉపాధి పనుల్లో తప్పుడు మస్తర్ నమోదు చేస్తున్నారని ఆరోపణల నేపథ్యంలో సోమవారం నూజివీడు మండలంలో జిల్లా విజిలెన్స్ అధికారి, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సంయుక్తంగా విచారణ చేసేందుకు ఆదేశించినట్లు తెలిపారు. విచారణ నివేదిక అందిన వెంటనే అందులో ఏమైనా పొరపాట్లు గుర్తిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. మండలాల్లో ప్రోగ్రాం ఆఫీసర్లు ఉపాధిహామీ పనుల నిర్వహణలో చురుగ్గా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశాలిచ్చారన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్లు తప్పనిసరిగా మస్తర్లు తనిఖీ చేయాలని ఆదేశించడం జరిగిందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని మరింత పారదర్శకంగా నిర్వహించి ఎక్కువ మంది శ్రామికులకు పని కల్పించి ఆశించిన వేతనాలు అందేలా కృషి చేస్తున్నామన్నారు.

జీతాలు పెంచాలని ఇంజినీరింగ్ కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని టెక్నికల్, నాన్ టెక్నికల్ జీతాలు ఇవ్వాలని కోరుతూ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన ఆందోళనలో భాగంగా మంగళవారం స్థానిక కోటదిబ్బ రిజర్వాయర్ నుంచి హెడ్ పోస్ట్ ఆఫీసు, గడియారపు స్తంభం, మెయిన్ బజారు, బిర్లా భవన్ సెంటర్ మీదుగా పాత బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వరకూ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన ధర్నాను ఉద్దేశించి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు ఆరేళ్లుగా తీవ్ర అన్యాయాన్ని గురయ్యారన్నారు. ఒక్కో ఇంజినీరింగ్ కార్మికుడు ఈ ఆరు సంవత్సరాల కాలంలో నాలుగు లక్షలకు పైగా నష్టపోయారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, టెక్నికల్ జీతాలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, పర్మినెంట్ చేయాలని, రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని చేస్తున్న ఆందోళనకు సిఐటియు పూర్తి మద్దతు తెలియజేస్తుందని తెలిపారు. ప్రభుత్వం దిగి వచ్చేంత వరకూ ఇంజినీరింగ్ కార్మికులు ఆందోళన కొనసాగించాలని, ఇంజినీరింగ్ కార్మికుల ఆందోళనకు అన్ని విభాగాల మున్సిపల్ కార్మికులూ మద్దతుగా ఉంటారని తెలిపారు. నున్న అశోక్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తొమ్మిది రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరం అన్నారు. ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న ఆందోళనకు ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు లావేటి కృష్ణారావు, అంగులూరి జానుబాబు, బంగారు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు. కార్యక్రమానికి యూనియన్ నాయకులు కానూరు సత్యనారాయణ, కె.సాంబశివరావు, రాజేష్, నాయకత్వం వహించారు. ఈ నెల 30వ తేదీన జరిగే చర్చల్లో ప్రభుత్వం ఇంజినీరింగ్ కార్మికుల జీతాలను పెంచని పక్షంలో ఆందోళన ఉధృతం చేయాలని వారు నిర్ణయించుకున్నారు.

ఉచిత న్యాయ సహాయాన్ని వినియోగించుకోండి

ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్

జిల్లా కారాగారాంలో తనిఖీలు



ఆహార నాణ్యత పరిశీలిస్తున్న కె.రత్నప్రసాద్


ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఖైదీలు, వారి కుటుంబసభ్యులు ఉచిత న్యాయ సహాయాన్ని వినియోగించుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. స్థానిక జిల్లా కారాగారాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. కరాగారంలో ఖైదీలకు అందుతున్న భోజన, ఇతర సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారాగారంలో ఖైదీలకు అందిస్తున్న సౌకర్యాలపై ఎప్పటికప్పుడు తనిఖీ నిర్వహించి సంబంధిత అధికారులకు సూచనలు చేయాల్సిన బాధ్యత జిల్లా న్యాయ సేవాధికార సంస్థపై ఉందన్నారు. అందులో భాగంగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆర్థికంగా వెనకబడి, న్యాయవాదిని నియమించుకోలేని ఖైదీలకు ఉచిత న్యాయ సహాయాన్ని అందించనున్నట్లు తెలిపారు. అలాగే ఖైదీల కుటుంబ సభ్యులకు ఎటువంటి న్యాయ సహాయం అవసరమైన జిల్లా న్యాయసేవాధికారి సంస్థ ఉచితంగా అందిస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైలర్ వెంకటరెడ్డి, ప్యానల్ అడ్వకేట్ మధు, తదితరులు పాల్గొన్నారు.

పోష్ చట్టంపై అవగాహన అవసరం

చింతలపూడి కోర్టు ప్రాంగణంలో న్యాయవిజ్ఞాన సదస్సు

చింతలపూడి : పోష్ చట్టంపై అవగాహన ఉండాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. చింతలపూడి కోర్టు ప్రాంగణంలో పోష్ చట్టంపై మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక దాడులను నిరోధించే చర్యల్లో భాగంగా ఈ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి సంస్థలో మహిళల సమస్యలను పరిష్కరించడానికి కమిటీలను ఏర్పాటు చేసి, ఆ వివరాలను బహిరంగంగా పొందుపరచాలని సూచించారు. చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు మాట్లాడుతూ సమాజంలో బాలికలపై అత్యాచారాలను నిరోధించడానికి ప్రతి పౌరుడూ నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ పి.మాధవి, జూనియర్ సివిల్ జడ్జి, కోర్టు సూపరింటెండెంట్ పిజి.నాయుడు, అడ్వకేట్ కెకెడి.భవాని, పోలీసులు పాల్గొన్నారు.



డిఆర్‌ఒకు వినతిపత్రం అందిస్తున్న దళిత సంఘాల నేతలు

దళితులపై దాడులు దారుణం

దళిత సంఘాల ఆధ్వర్యంలో

కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దళితులపై జరుగుతున్న దాడుల పరంపరపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ నగరంలోని దళిత సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రధానంగా జేమ్స్ అనే ఇంజినీరింగ్ విద్యార్థిపై అమానుషంగా సభ్యసమాజం సిగ్గుపడేలా దాడిచేసి చిత్రహింసలకు గురిచేసి మూత్రం తాగించిన సంఘటనపై వివిధ అంబేద్కర్ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. దేశంలోనే గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రసిద్ధి చెందిన తిరుపతిలో సినీ రంగంలో గొప్ప పేరున్న ప్రముఖ నటుడు మోహన్‌బాబు విద్యాసంస్థలో చదువుకున్న బీటెక్ విద్యార్థిపై పాశవిక దాడి చేసిన దురహంకారులు రూప్‌నాయుడు, యశ్వంత్ నాయుడులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనతో పాటు తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో మల్లాం గ్రామంలో జరిగిన దళితుల సాంఘిక బహిష్కరణ ఘటనపై డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ స్పందించలేదన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో డిఆర్‌ఒకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎఐడిఆర్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.మణిసింగ్, కులవివక్ష పోరాట సంఘం నాయకులు మంచెళ్ల ఇసాక్, ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘాల జనరల్ సెక్రటరీ డాక్టర్ మెండెం సంతోష్‌కుమార్, ఆర్‌పిఐ (ఎ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మత్తె బాబీ, అఖిల భారత దళిత ఫోరం వ్యవస్థాపకులు నూకపెయ్యి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

వ్యకాస రాష్ట్ర అధ్యక్షురాలు నాగరాణి



మాట్లాడుతున్న నాగరాణి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు నాగరాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పి.అంకంపాలెం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పని ప్రదేశానికి ఆమె మంగళవారం వెళ్లి కూలీలతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఆరు వారాలుగా ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలకు వేతనాలు ఇవ్వడంలేదన్నారు. దీంతో కూలీలు అవస్థలకు గురవుతున్నారన్నారు. ఇప్పటివరకు బకాయి ఉన్న వేతనాలను తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కారం నాగ దుర్గ, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

యోగాను దినచర్యగా చేసుకోవాలి

యోగాంధ్ర ప్రత్యేక ర్యాలీలో కలెక్టర్ వెట్రిసెల్వి



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రతిఒక్కరూ యోగాను దినచర్యగా చేసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని పురస్కరించుకుని మంగళవారం ఏలూరు ఇండోర్ స్టేడియం నుంచి నిర్వహించిన యోగాంధ్రపై ప్రత్యేక ర్యాలీని కలెక్టర్ కె.వెట్రిసెల్వి జెండా ఊపి ప్రారంభించారు. ఇండోర్ స్టేడియం నుంచి ఫైర్ స్టేషన్ సెంటర్ వరకు, అక్కడి నుంచి కొత్త బస్టాండ్ వరకు నిర్వహించిన యోగాపై అవగాహనా ర్యాలీలో అన్ని తరగతుల ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఈ నెల 21 నుంచి జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం వరకు గ్రామ, మండల, జిల్లాస్థాయిలో యోగాపై అవగాహన కలిగించే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో నాలుగు పర్యాటక ప్రాంతాల్లో ఎంపిక చేసిన నాలుగు రోజులు యోగా సాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ యోగాకు సంబంధించి వివిధ స్థాయిల్లో పలు పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఉమామహేశ్వరరావు, ఆయూష్ ఆర్ డిడి లక్ష్మీసుభద్ర, నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్, ఎల్ డిఎం డి.నీలాద్రి, డిసిఒ కె.శ్రీనివాస్, డిఇఒ వెంకటలక్ష్మమ్మ, డిఎస్‌డిఒ పి.శ్రీనివాసరావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.శివరామమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకిదేవి, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి.పాండురంగారావు, ఏలూరు తహశీల్దార్ జివి.శేషగిరి, తదితరులు పాల్గొన్నారు.

కిలో కోకో గింజలకు రూ.500

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ

కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కిలో కోకో గింజలు రూ.500 కొనుగోలుకు సంబంధించిన ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిందని కోకో రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బొల్లు రామకృష్ణ, కె.శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 23వ తేదీన ఏలూరు కలెక్టరేట్‌లో జరిగిన చర్చల సందర్భంగా మాండలీజ్ కంపెనీ ప్రతినిధులు కిలో కోకో గింజలు రూ.450లకు మించి కొనుగోలు చేయలేమని చెప్పగా రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.50 ఇస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించినట్లు తెలిపారు. అందుకు సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను 26వ తేదీ సాయంత్రం జారీ చేసినట్లు పేర్కొన్నారు. అన్ని కంపెనీల ట్రేడర్లు కిలో కోకో గింజలకు రూ.500 ఇచ్చి ఈ ఆదేశాల ప్రకారం కొనుగోలు చేయాల్సి ఉందని తెలిపారు. అయితే రైతులు అందుకు సంబంధించిన దరఖాస్తులు పూర్తి చేసి రైతు సేవా కేంద్రాల్లో అందించాల్సి ఉందని పేర్కొన్నారు. అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుసంధానిస్తూ ఫార్ములా రూపొందించి ధర ప్రకటించే విధానం కోసం కోకో రైతుల సంఘం పోరాటం చేస్తుందని, ఈ పోరాటంలో కోకో రైతులందరూ భాగస్వాములు కావాలని పేర్కొన్నారు.

ఇండియన్ బ్యాంకులో సిడిఎం ఏర్పాటు

మండవల్లి శాఖ మేనేజర్ జ్యోతిప్రసాద్

మండవల్లి : ఖాతాదారుల సౌలభ్యం కోసం ఇండియన్ బ్యాంకులో క్యాష్ డిపాజిట్ మిషన్ ఏర్పాటు చేస్తున్నామని ఇండియన్ బ్యాంక్ మండవల్లి శాఖ మేనేజర్ కె.జ్యోతిప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఇండియన్ బ్యాంకులో మంగళవారం నిర్వహించిన ఖాతాదారుల సమావేశంలో సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎటిఎంలో నగదు ఉండడం లేదని, ఒకటి లేదా రెండు రోజులు సెలవులు వస్తే అమౌంట్ ఖాళీ అయిపోతుందని బ్యాంకు దృష్టికి తీసుకొచ్చినట్లు చెప్పారు. క్యాష్ డిపాజిట్ మిషన్ ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తొలగుతాయని ఖాతాదారులు సూచనలు కూడా చేసినట్లు తెలిపారు. ఖాతాదారుల సూచనలను ఇండియన్ బ్యాంక్ హెడ్ ఆఫీస్‌కు తీసుకెళ్లామన్నారు. దీంతో ఇండియన్ బ్యాంక్ సేవలను మరింత విస్తృతం చేస్తూ ఖాతాదారుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఇండియన్ బ్యాంక్ మండవల్లి శాఖలో క్యాష్ డిపాజిట్ మిషన్ ఏర్పాటు చేసేందుకు అధికారులు సుముఖత వ్యక్తం చేసినట్లు చెప్పారు. ఈ మేరకు క్యాష్ డిపాజిట్ మిషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. రెండు మూడు రోజుల్లో క్యాష్ డిపాజిట్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. అంతేకాకుండా బ్యాంకులో త్వరలో ఎసిలను కూడా ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సేవలను ఖాతాదారులు వినియోగించుకోవాలని కోరారు.



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

1న బాలు గానలహరి

ప్రజాశక్తి - ఏలూరు

జూన్ ఒకటో తేదీన సాయంత్రం నాలుగు గంటలకు వైఎంహెచ్ఎ హాలులో బాలు గానలహరి నిర్వహించనున్నట్టు హేలాపురి సింగర్స్ అసోసియేషన్ తెలిపింది. కార్యక్రమం బ్రోచర్లను సాహిత్య మండలి భవనంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హేలాపురి సింగర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పి.సూర్యప్రకాష్, ఎస్.రవి, కె.శ్రావణికుమారి, జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు డాక్టర్ లంకా వెంకటేశ్వర్లు, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, హేలాపురి బాలోత్సవం ఆహ్వాన సంఘ అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, వివిధ సంస్థలకు చెందిన వారు బలుసు కాళిదాసు, డాక్టర్ బి.ఇమ్మానియేల్, పివిజి.సత్యవాణి, సంధ్యారాణి, కెవి.నారాయణరావు, బివిఎస్.సాగర్, పుల్లభొట్ల పురుషోత్తం, మేతర అజయ్‌బాబు, వి.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, పి.ఆదిశేషు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హేలాపురి సింగర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రవి మాట్లాడుతూ జూన్ ఒకటో తేదీ ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భాన్ని పురస్కరించుకుని జూన్ ఒకటో తేదీన ఆదివారం హేలాపురి సింగర్స్ అసోసియేషన్ గాయకులచే బాలు గాన లహరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సింగర్స్ పి.సూర్యప్రకాష్, కె.శ్రావణికుమారి మాట్లాడుతూ బాలు గాన లహరి కార్యక్రమాలకు ఏలూరు పరిసర ప్రాంత కళాభిమానులు, కళాకారులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆలపాటి నాగేశ్వరరావు, గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ మానవత, వాల్ ఫ్రెండ్ నెస్, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం ఈ కార్యక్రమానికి ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు.

ఆర్‌టిసి బస్టాండ్‌లో కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు ఆర్‌టిసి బస్టాండ్‌ను మరింత పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌టిసి అధికారులను కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. ఏలూరు కొత్త బస్టాండ్‌ను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లోని ప్లాట్ ఫారమ్‌లను పరిశీలించారు. బస్టాండు పిల్లల్లో ఉన్న బస్సుల సమయ వేళలను తనిఖీ చేశారు. బస్టాండ్‌లోని పలుస్టాల్స్‌ను సందర్శించి స్టాల్స్‌లో ఉన్న తినుబండారాల ప్యాకెట్లపై తయారీ, ముగింపు తేదీలను పరిశీలించారు. అక్కడ నుంచి విచారణ కేంద్రాన్ని సందర్శించారు. బస్టాండ్‌లోని క్యాంటీన్‌కు వెళ్లి వంటశాలలో ఆహార పదార్థాల తయారీ విధానాన్ని పరిశీలించారు. ప్రయాణికులకు క్యాంటీన్‌లో తినుబండారాల నాణ్యతను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. మరుగుదొడ్ల పరిశుభ్రతను పరిశీలించి, బస్టాండు శుభ్రతకు ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు అందించాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. ప్రయాణికులకు ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని, శ్రీ సత్య సాయి వాటర్ ప్లాంట్‌ను సందర్శించారు. రిజర్వేషన్ కౌంటర్‌ను తనిఖీ చేసి రిజర్వేషన్ సౌకర్యం గురించి ఆరా తీశారు. త్వరలో పాత బస్టాండ్ తనిఖీ చేస్తానని, అప్పటికి మరిన్ని మెరుగైన సౌకర్యాలు అందించే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి, బస్ స్టేషన్ మేనేజర్ కెవి.కుమారి, పిఆర్ఒ నరసింహం పాల్గొన్నారు.

జిఒ 3ను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక డిఎస్‌సి ప్రకటన విడుదల చేయాలని, జిఒ 3ని పునరుద్ధరించాలని భద్రాచలం మాజీ పార్లమెంట్ సభ్యులు మిడియం బాబూరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని జగన్నాథపురం గ్రామంలో ఏర్పాటు చేసిన గిరిజన సంఘం జిల్లా స్థాయి శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. జిఒ 3 ప్రాంతంలో అమాయక గిరిజనులకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. ఏజెన్సీ ప్రాంత గిరిజనులకు ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలని, జిఒ 3ని పునరుద్ధరించాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు ముంపు నిర్వాసితులకు పరిహారం, పునరావాసం కల్పించాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీ చట్టాల హక్కులను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, జిల్లా కార్యదర్శి దర్శల రమేష్, కమిటీ సభ్యులు తెల్లం దుర్గారావు, కారం భాస్కర్, బల్లెమ్మ, గుజ్జ నాగేంద్ర పాల్గొన్నారు.

ఇసుక ర్యాంపుల పరిశీలన

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని కిన్నెరసాని వాగు వద్ద ఇసుక ర్యాంపులను తహశీల్దార్ కె.రమేష్‌బాబు, మండల సర్వేయర్ మధుసూదనరావు, సిఐ ఎం.రమేష్‌బాబు మంగళవారం పరిశీలించారు. ఆంధ్ర, తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన కిన్నెరసాని వాగు వద్ద ఇసుక ర్యాంపుల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు తనిఖీలు చేశామని వారు తెలిపారు. సిబ్బందిని పికెట్‌గా నియమించి ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే వాహనాలను సీజ్ చేసి, వాహనదారులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కాంగ్రెస్ ఆధ్వర్యాన నెహ్రూ వర్ధంతి

ఏలూరు సిటీ : ఆధునిక భారతవని రూపశిల్పి, భారత తొలి ప్రధాని, కీర్తిశేషులు పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 61వ వర్ధంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజనాల రామ్మోహన్‌రావు మాట్లాడుతూ నవభారతంలో పారిశ్రామికీకరణకు బాటలు వేసిన నాయకుడు నెహ్రూ అని, బహుళార్ధ సాధక ప్రాజెక్టులు, పంచవర్ష ప్రణాళిక ప్రవేశపెట్టి దేశ ఆర్థిక స్థితి మెరుగుపడటానికి కృషి చేశారని చెప్పారు. ఆయన ఆస్తి నంతా దేశ స్వాతంత్ర పోరాటానికి ధారపోసిన మహా నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గౌడు రంగబాబు, లంకా రామ్మోహన్, దండుబోయిన చంద్రశేఖర్, ప్రతాప సుబ్రహ్మణ్య శర్మ, వల్లకవి శ్రీనివాస్, సూర్యనారాయణ, సేవాదళ్ సుబ్బారావు, కెఎస్ఎన్.మూర్తి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

లారీ ఢీకొని రెవెన్యూ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని కొన్నంగుంట గ్రామం వద్ద మంగళవారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో సబ్ కలెక్టర్ కార్యాలయ దఫేదార్ సుబ్బారావు మృతి చెందారు. ఆగిరిపల్లి వైపు నుంచి నూజివీడు వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న సుబ్బారావును ఎదురుగా వచ్చిన నూజివీడు నుంచి ఆగిరిపల్లి వెళ్తున్న ఐషర్ వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన సుబ్బారావు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సుబ్బారావు మృతి పట్ల రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు సంతాపం ప్రకటించారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు.

వ్యాన్‌ను ఢీకొన్న కంటైనర్ : ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

టాటా మ్యాజిక్ వాహనాన్ని కంటైనర్ ఢీకొనడంతో ఆ వాహనం బోల్తా పడి ఆరుగురు గాయాలపాలయ్యారు. ఈ ఘటన దెందులూరు జాతీయ రహదారిలో హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... కృష్ణా జిల్లా పామర్రు ప్రాంతానికి చెందిన 15 మంది ఒకే కుటుంబ సభ్యులు టాటా మ్యాజిక్ వాహనంలో కోనసీమ జిల్లా వాడపల్లి గ్రామంలో ఉన్న వెంకటేశ్వర స్వామి దర్శనార్థం మంగళవారం తెల్లవారుజామున బయలుదేరారు. వారి వాహనం దెందులూరు జాతీయ రహదారిలోని దెందులూరు సమీపానికి చేరుకునేసరికి వెనుకగా వస్తున్న గుర్తు తెలియని కంటైనర్ వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహనం బోల్తా పడడంతో ఆరుగురు గాయాలపాలయ్యారు. 108 సిబ్బంది క్షతగాత్రులను దెందులూరు పిహెచ్‌సికి తరలించారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి -ముదినేపల్లి


మండలంలోని కాకరవాడ గ్రామ పంచాయతీ పరిధిలో పేకాట స్థావరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.నాలుగు వేలు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కార్పొరేట్‌కు దీటుగా 'శ్రీసాయి గీతాంజలి'లో విద్యాబోధన

పాఠశాల కరస్పాండెంట్ శివకోటియాదవ్

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు

ప్రజాశక్తి - ముసునూరు



శివకోటియాదవ్

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా శ్రీ సాయి గీతాంజలి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో విద్యాబోధన నేర్పిస్తున్నామని ఆ పాఠశాల కరస్పాండెంట్ వేల్పుల శివకోటి యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. సరికొత్త ఆలోచనలతో నిత్య నూతనమైన ప్రతిష్ట విద్యా విధానాలతో అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు ప్రతిరోజూ స్టడీ అవర్స్ క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. ఎంతో అనుభవం కలిగిన ఉపాధ్యాయుల నుంచి, చదివిన సబ్జెక్టుల నుంచి తమ పాఠశాల ద్వారా బెస్ట్ మెటీరియల్ తయారుచేసి విద్యాబోధన అందించడంతో నూటికి నూరు శాతం ఫలితాలు సాధిస్తున్నామన్నారు. క్వాలిఫైడ్‌తో కూడిన పూర్తి అనుభవం ఉన్న ఉపాధ్యాయ సిబ్బందితో ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాభ్యాసం ఉంటుందన్నారు. ఇంగ్లీష్, లెక్కలు, సైన్స్ సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నామన్నారు. ఆయా సబ్జెక్టుల్లో అందరికీ ఒకే విధమైన మార్కులు వచ్చేలా సైన్స్ పరికరాల ద్వారా నిరూపణ చేస్తూ వారి పరిజ్ఞానం పెంపొందించేలా కృషి చేస్తున్నామన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు ఎల్‌కెజి నుంచి పదో తరగతి వరకు యాక్టివిటీ బెస్ట్ ఎడ్యుకేషనల్ మెటీరియల్ అందించి విద్యాబోధన అందించనున్నట్లు తెలిపారు. కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనల్ డెవలప్‌మెంట్ నిర్వహణ కోసం ప్రత్యేక అర్హతలు ఉన్న ఉపాధ్యాయులతో శిక్షణా తరగతులు నిర్వహించి విద్యార్థుల్లో మంచి మార్కులు తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం వంటి ప్రత్యేక కార్యక్రమాల్లో డ్యాన్స్, క్రీడలు, ఆట పోటీలు నిర్వహించి వారిలో ప్రతిభ కనబరిచినవారికి ప్రత్యేక బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. నవోదయ, గురుకుల బాలికల పాఠశాలలకు ప్రతి ఏడాది కొందరు విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చి పంపించనున్నట్లు చెప్పారు. పదో తరగతి ఫలితాల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత కావడం పాఠశాల ప్రత్యేకత అన్నారు. ఆటలు, పాటలతో కూడిన విద్యను అందించనున్నట్లు తెలిపారు. చిన్ననాటి నుంచే సాంప్రదాయ, సంస్కృతి విలువలు విద్యార్థుల్లో పెంపొందించేందుకు రంజాన్, దసరా, సంక్రాంతి, క్రిస్మస్ పండుగల వేడుకలు పాఠశాలలో నిర్వహించి, విద్యార్థుల్లో అంతర భావం ఒకేలా ఉండేలా పెంపొందించనున్నట్లు తెలిపారు. సాయంత్రం వేళ ప్రతిరోజు వ్యాయామ ఉపాధ్యాయుల ద్వారా క్రీడాపోటీలు నిర్వహించి ఆ రంగంలో కూడా అద్భుత ప్రతిభ కనబరిచేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.



శ్రీసాయిగీతాంజలి స్కూల్

గుండెపోటుతో ఎఆర్ ఎస్ఐ మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్



శ్రీనుకొండలరావు (ఫైల్)

గుండెపోటుతో ఎఆర్ ఎస్ఐ మృతి చెందారు. ఏలూరు నగరానికి చెందిన గొల్ల శ్రీనుకొండలరావు ఏలూరు ఎఆర్ యూనిట్‌లో ఎఆర్ ఎస్ఐగా పనిచేస్తున్నారు. 1989 బ్యాచ్‌కు చెందిన ఆయన సర్వీస్ మొదట నుంచి ఇప్పటివరకు జిల్లా ఎఆర్ విభాగంలోనే పని చేస్తున్నారు. మొదట ఎఆర్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన ఆయన ఎఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసి, ప్రస్తుతం ఎఆర్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఆరు గంటల సమయంలో తనకు అనారోగ్యంగా ఉందని కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో కుటుంబసభ్యులు ఆయనను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరుకున్న తర్వాత హఠాత్తుగా కార్డియాక్ అరెస్టు కావడంతో ఆయన అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందారు. తోటి సిబ్బంది ఆయన మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతదేహానికి ఎఆర్ ఆర్ఐ పవన్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ సిఐ మల్లేశ్వరరావు, పోలీసు సంక్షేమ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

బదిలీలకు 165 దరఖాస్తులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉపాధ్యాయుల బదిలీలకు దరఖాస్తు మంగళవారంతో ముగిసిందని ఉంగుటూరు ఎంఇఒ నిమ్మగడ్డ రవీంద్ర భారతి తెలిపారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు నలుగురు, స్కూల్ అసిస్టెంట్స్ 92 మంది, సెకండరీ గ్రేడ్ టీచర్లు 67 మంది, లాంగ్వేజ్ పండిట్స్ ఇద్దరు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రధానోపాధ్యాయులకు, స్కూల్ అసిస్టెంట్లకు ఆన్‌లైన్ వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ ద్వారా, సెకండరీ గ్రేడ్ టీచర్స్‌కు ఆఫ్ లైన్‌లో మాన్యువల్ విధానం కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం జరుగుతాయని తెలిపారు.

బంగారు కుటుంబాలకు చెక్కులు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

పి4లో భాగంగా ఆగిరిపల్లిలో సిఎం చంద్రబాబు బహిరంగ సభ సందర్భంగా ఆయన సమక్షంలో మార్గదర్శకునిగా ముందుకు వచ్చిన నూజివీడు సీడ్స్ అధినేత మండవ ప్రభాకరరావు తాను దత్తత తీసుకున్న ఆగిరిపల్లికి చెందిన కుటుంబాల్లో రెండు బంగారు కుటుంబాలకు చెక్కులు అందించారు. బోనం లక్ష్మీదుర్గకు షాపు ఏర్పాటు చేసుకునే నిమిత్తం రూ.50 వేలు, నక్కనబోయిన వెంకట్రావుకు గేదెలు కొనుగోలు చేసుకునే నిమిత్తం రూ.75 వేల చెక్కులను నూజివీడులోని ఆయన స్వగృహంలో మంగళవారం అందించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజు, ఆగిరిపల్లి ఎంపిడిఒ బి.ఆనంద్‌బాబు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో కందుకూరి వర్ధంతి

కొయ్యలగూడెం : నవయుగ వైతాళికుడు సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతి కార్యక్రమం మంగళవారం శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. లైబ్రేరియన్ యు.రాముడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి స్పందన స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు బలుసు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై విరేశలింగం పంతులు ఘనతను చిన్నారులకు వివరించారు. కందుకూరి చిత్రపటానికి చిన్నారులు నివాళులర్పించి జోహార్లు అర్పించారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన తరగతులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు 25వ రోజు మంగళవారం ఎంతో ఘనంగా జరిగాయి. విద్యార్థులు కూడా శిక్షణా తరగతుల్లో ఎంతో ఆసక్తిగా పాల్గొన్నారు. తొలుత విద్యార్థులతో కథలు చదివించడం, చెప్పించడం చేశారు. తొలుత తెలుగు పర్యాయ పదాలపై శిక్షణ అందించారు. జనరల్ నాలెడ్జ్, క్విజ్ పోటీలను కూడా నిర్వహించారు. అనంతరం రిసోర్స్ పర్సన్ ఐ.శ్రీనివాసరావు విద్యార్థులకు శాస్త్రవేత్తలు, రాకెట్స్ ప్రయోగాలు, చంద్రయాన్ గురించి వివరించారు. ఉదాహరణగా ఎపిజె అబ్దుల్ కలాం గొప్పశాస్త్రవేత్త అని ది మిస్సైల్ మ్యాన్‌గా దేశం గర్వించదగ్గ వ్యక్తుల్లో ఒకరని, దేశానికి 11వ రాష్ట్రపతిగా చేశారని తెలిపారు. చిన్నారులకు స్నాక్స్ పంచి పెట్టారు. ఈ శిక్షణా కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ విటి.సందీప్ కుమార్, ఎండి.అస్లాంపాషా, ఎం.కనకదుర్గ పాల్గొన్నారు.

ముదినేపల్లి : ముదినేపల్లి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతుంది. మంగళవారం యోగాపై గ్రంథాలయ అధికారిణి శ్రీదేవీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. మన ప్రాచీన విధానంలో యోగా ఒక భాగమని, శారీరక, మానసిక సమస్యలకు యోగా చక్కని పరిష్కారం చూపుతుందన్నారు. ఈ వేసవి విజ్ఞాన శిబిరంలో 32 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆశావర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షురాలు కె.పోశమ్మ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మాతా శిశు మరణాల రేటు తగ్గించడంలో, ప్రభుత్వాసుపత్రిలోనే ప్రసవాలు అత్యధికంగా జరగడంలో ఆశావర్కర్ల పాత్ర ప్రముఖమైందని ఆశావర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షురాలు కె.పోశమ్మ అన్నారు. ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా స్థాయి శిక్షణ శిబిరం స్థానిక యుటిఎఫ్ హాలులో మంగళవారం నిర్వహించారు. ఆశా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు మంగతాయారు అధ్యక్షతన నిర్వహించిన శిక్షణ శిబిరంలో ముఖ్యఅతిథిగా పోశమ్మ హాజరై మాట్లాడారు. ఆశావర్కర్లు 24 గంటలు డ్యూటీ చేస్తున్నారని, కరోనా టైంలో ప్రాణాలకు తెగించి ఇంటింటికి తిరిగి ప్రజలను రక్షించడంలో ప్రధాన పాత్ర పోషించారని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఆశా కార్యకర్తలు ఐక్యంగా పోరాడాలని, తమ హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్మికులు రాజకీయాలు అనే అంశంపై సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు మొడియం నాగమణి మాట్లాడారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ బిజెపి మతోన్మాద రాజకీయాలను కార్మిక వర్గం అర్థం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు పసల సూర్యారావు, పట్టణ నాయకులు బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. బర్రింకలపాడు క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల ఎంపిడిఒలు, తహశీల్దార్లతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల్లో అధికారులు చిత్తశుద్ధితో పని చేసి మండలాభివృద్ధికి సహకరించాలన్నారు. అనంతరం ఆయా మండలాల్లో జరిగే అభివృద్ధి పనులు, మండల సమస్యలపై అధికారులతో చర్చించారు. పలు చోట్ల కొన్ని పనుల విషయంలో కొంతమంది అధికారులు జాప్యం చేస్తున్నారని, అటువంటివి పునరావృత్తం కాకుండా చూడాలన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

ఘనంగా జెట్టి గురునాధరావు పుట్టినరోజు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడేనికి చెందిన వైసిపి మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకులుగా పని చేస్తున్న జెట్టి గురునాధరావు పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అమ్మ ప్రేమ స్వచ్ఛంద సేవా సంస్థ వద్ద కేక్ కట్ చేసి చిన్న పిల్లలకు నూతన వస్త్రాలు పంపిణీ, అన్నదానం చేశారు. సీతామహాలక్ష్మి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులకు ఐదు మంచాలు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేగవరంలో, పంగిడిగూడెంలో, అక్కంపేటలో, పలు గ్రామాల్లో పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు.

కొయ్యలగూడెం : జెట్టి గురునాధరావు పుట్టినరోజు సందర్భంగా మూగజీవాలకు ఫల ఆహారాలను, పప్పు దినుసులను అందించినట్లు వైసిపి గంగవరం గ్రామ కన్వీనర్ కంచర్ల సత్యనారాయణ, ఎంపిటిసి కొండేపాటి చింతయ్య తెలిపారు. ప్రకాశరావుపాలెం అటవీ ప్రాంతంలోని వానరాలకు, కొయ్యలగూడెంలోని గోశాలకు ఫలాలను, దినుసులను పంపిణీ చేశారు. వైసిపి యూత్ లీడర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాపారావు, ఈడుపుగంటి తాతారావు, ఆనందరావు, కొడారి సందీప్, కొడాలి చిన్న, ఏసు తదితరులు పాల్గొన్నారు.

కాపా ఆధ్వర్యంలో మహానాడుకు తరలిన టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని రావిచర్ల గ్రామం నుంచి మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్, గ్రామ సర్పంచి, సర్పంచుల సంఘం డివిజన్ అధ్యక్షులు కాపా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం మహానాడు కార్యక్రమానికి టిడిపి శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. ముందుగా గ్రామంలోని టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మహానాడు సభలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సు సర్వీసులను కాపా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానాడును కడపలో ఏర్పాటు చేయడం ఎంతో అద్భుతమైన చారిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించారు. మహానాడు సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన పటిష్టమైన ముందుస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామం నుంచి కూడా తన వంతుగా ప్రత్యేక బస్సు సర్వీసుల ద్వారా టిడిపి శ్రేణులను మహానాడుకు తీసుకువెళ్లి గ్రామానికి తీసుకురానున్నట్లు తెలిపారు. ఇది తన బాధ్యతగా స్వీకరించినట్లు చెప్పారు.

స్థలాల కోసం 19 ఏళ్లుగా పోరాటం

పోలీస్‌స్టేషన్‌కు కేటాయిస్తూ పంచాయతీ తీర్మానం


అవాక్కైన లబ్ధిదారులు

ఇదెక్కడి న్యాయమని ప్రశ్నిస్తున్న ప్రజలు

ప్రజాశక్తి - మండవల్లి

పేదవాడి కల సొంతిల్లు. ఆ కలను నెరవేర్చుకునేందుకు ఏళ్ల తరబడి పోరాటం చేస్తూనే ఉన్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా 19 ఏళ్ల పోరాటానికి ఫలితం దక్కుతుందని, సొంతింటి కల నెరవేరుతుందని ఆశించిన లబ్ధిదారుల ఆశలపై కొందరు నీళ్లు చల్లారు. పేదల ఇళ్ల స్థలాలను పోలీస్ స్టేషన్‌కు బదలాయిస్తూ పంచాయతీ తీర్మానించడంతో లబ్ధిదారులు అవాక్కయ్యారు. ఎప్పుడో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను పోలీస్ స్టేషన్‌కు కేటాయించడంతో అత్త సొమ్ము అల్లుడు దానం అన్న చందంగా పంచాయతీ ఉందనే బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి. స్థలాలు మెరకైనా చేయండి లేదా పట్టాలయినా పంపిణీ చేయండి అంటూ 19 ఏళ్లుగా పోరాటం చేస్తున్నా పట్టించుకోకుండా పేదల స్థలాలను పోలీస్ స్టేషన్‌కు కేటాయించే హక్కు ఎవరిచ్చారంటూ లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గాలికొదిలేసి పోలీస్ స్టేషన్‌కు స్థలం కేటాయించడమే అజెండాగా చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా తీర్మానించడంతో సర్పంచి, కార్యదర్శుల తీరుపై ప్రజలు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు.

ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి 2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తరుగు మూల వద్ద 482/1 సర్వే నెంబర్‌లోని 4.10 ఎకరాల భూమిని కొనుగోలు చేసి మాజీ ఎంఎల్ఎ, కీర్తిశేషులు ఎర్నేని రాజారామచంద్ర చేతులమీదుగా 130 మందికి పట్టాలను పంపిణీ చేశారని లబ్ధిదారులు చెబుతున్నారు. వెంటనే ఆ స్థలాల్లో గృహాలు నిర్మించేలా పట్టాలను గృహ నిర్మాణ శాఖకు అప్పగించారని, అప్పటి నుంచి ఎవరూ పట్టించుకోకపోవడంతో 19 ఏళ్ల నుంచి మెరకైనా చేయండి లేదా పట్టాలైనా ఇవ్వండి అంటూ



పోలీస్‌స్టేషన్‌కు కేటాయించిన పేదలకు ఇచ్చిన స్థలం

కలెక్టర్ల కార్యాలయం చుట్టూ, ప్రజాప్రతినిధుల ఇళ్ల చుట్టూ తిరిగినా కనికరించిన నాథుడు కరువయ్యాడని లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో గ్రామ సభల్లో నిరసనలు, ధర్నాలు చేసినప్పటికీ పంచాయతీ అధికారులు పట్టించుకోలేదని చెబుతున్నారు. సొంత కల నెరవేర్చుకోలేక ఎంతో మంది చనిపోగా, అద్దెలు కట్టలేక పిల్లాపాపలతో మరెంతో మంది ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థలాలను పోలీస్‌స్టేషన్‌కు కేటాయించే హక్కు ఎవరిచ్చారంటూ లబ్ధిదారులు నిలదీస్తున్నారు. ప్రజల అభిప్రాయం సేకరణ లేకుండా ఎలా తీర్మానిస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో తాగునీరందక, మురుగుపారక, చెత్త తరలక, దోమలతో, కుక్కలతో, పందుల స్వైర విహారంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను పక్కనపెట్టి పోలీస్‌స్టేషన్‌కు స్థలం కేటాయించడమే లక్ష్యంగా పెట్టుకోవడం ఎంతవరకు సమంజసం అంటూ నిలదీస్తున్నారు. ఇప్పటికైనా పేదల ఇళ్ల స్థలాల్లో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, స్థలాలను మెరక చేసి పేద ప్రజలు ఇల్లు నిర్మించుకునేలా సహకరించాలని వారు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి అడ్డుకుంటామని హెచ్చరిస్తున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి గిరిజాను ఛార్జ్ తీసుకోకుండా నిర్ణయాలు ఎలా తీసుకున్నారని, బోర్డు మీటింగ్ జరిగిందా అని వివరణ కోరగా వార్డు మెంబర్లు ఒకే చెప్పారని తెలిసిందని, తహశీల్దార్ ఒత్తిడి చేయడంతో తీర్మానం చేయాల్సి వచ్చిందని తెలిపారు.

ఇళ్ల మధ్యలో పోలీస్ స్టేషన్ తగదు

సిపిఎం నాయకులు కె.శ్రీనివాస్

లబ్ధిదారులకు ఉపయోగపడే విధంగా కామన్ సైట్‌ను నిర్ణయిస్తారు. ఇళ్ల మధ్య ఇళ్ల స్థలాల్లో ఉన్న కామన్ సైట్‌ను ఆక్రమించే విధంగా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడం తగదు. భవిష్యత్తులో ఆ ప్రాంతంలో పాఠశాలలు ప్రజలకు ఉపయోగపడే భవనాలు ఏర్పాటు చేయడానికి ఇబ్బందులు కలుగుతాయి. పోలీస్ స్టేషన్ కామన్ సైట్‌లో ఏర్పాటు చేయకుండా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా స్థలం కేటాయించి ఏర్పాటు చేయాలి. తీర్మానాన్ని వెనక్కి తీసుకుని స్థలాలు మెరక చేసి నివాసాలు ఏర్పాటు చేసుకునేలా సహకరించాలి.

ఎన్నో పోరాటాలు చేశాం

బుద్ధుల రాముడు, లబ్ధిదారుడు

ఇల్లు నిర్మించుకునేలా స్థలాలు మెరక చేయాలని ఎన్నోసార్లు అర్జీలు ఇచ్చాం. ఆందోళన చేసినా, ధర్నాలు చేపట్టినా పంచాయతీకి, ప్రభుత్వాలకు మాపై దయ కలగలేదు. అద్దెలు కట్టలేక, ఇరుకు గదిలో ఉండలేక సంవత్సరాల తరబడి ఇబ్బందులు పడుతున్నాం. లబ్ధిదారుల బాధలను గుర్తించి స్థలాలు మెరక చేసి ఇల్లు నిర్మించుకునేలా సహకరించాలి.

అపరిచిత ఫోన్ కాల్స్‌కు స్పందించొద్దు

ప్రజాశక్తి - ఏలూరు

నగరంలో ఉన్న పలు షాపు యజమానులకు కొంతమంది అపరిచిత వ్యక్తులు లేబర్ ఆఫీసర్ అని చెప్పి షాపు లైసెన్స్ ఉందా, లేదా రెన్యువల్ చేయాలి, రిజిస్టర్లు చూపాలని లేకపోతే షోకాజ్ నోటీసులు, జరిమానాలు విధిస్తామని బెదిరింపు ఫోన్ కాల్స్ చేస్తున్నారని కార్మిక శాఖ దృష్టికి వచ్చినట్లు ఏలూరు సహాయ కార్మిక కమిషనర్ జి.నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఈ విధంగా ఈ నెల 15వ తేదీ రాత్రి సమయంలో రామకృష్ణపురం మినీ బైపాస్‌లో ఉన్న లక్ష్మి కార్ ఎలక్ట్రికల్ వర్క్స్ యజమాని ఉప్పులూరి హేమశంకర్ అనే వ్యక్తికి ఇటువంటి బెదిరింపు ఫోన్ కాల్ చేయడంతో సదరు యజమాని కార్యాలయంలో, పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. ఇటువంటి అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని సూచించారు. ఎలాంటి బెదిరింపు ఫోన్ కాల్స్ వచ్చినా ఎడల కార్మిక శాఖ అధికారులు 9492555073, 9492555074, 9492555075 సంప్రదించాలని తెలిపారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై విచారణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

టి.నరసాపురం సచివాలయం-1లో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రాజ్ కుమార్ ఇల్లు అమ్ముతానని రూ.నాలుగు లక్షలు తీసుకుని తనను మోసం చేశాడని అదే గ్రామానికి చెందిన నంద్యాల వరప్రసాద్ ఈ నెల 12వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశాడు. దీంతో కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు గృహ నిర్మాణ సంస్థ పీడీ సత్యనారాయణ మంగళవారం విచారణ నిర్వహించారు. అనంతరం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మండలంలో గృహ నిర్మాణ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

నేడు నిర్వాసితులతో డిఆర్‌డిఎ పీడీ ముఖాముఖి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురై పునరావాస కాలనీల్లో ఉంటున్న నిర్వాసితులతో జిల్లా డిఆర్‌డిఎ పీడీ విజయరాజు బుధవారం ముఖాముఖి నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఉదయ్ భాస్కర్ తెలిపారు. మండలంలోని టేకూరు, ఎర్రవరం, సిరివాక, కోరుటూరు, గాజులగొంది, చీడూరు పునరావాస కాలనీలకు చేరుకుని కాలనీవాసులతో సమావేశమై వారి స్థితి గతులను, సమస్యలు తెలుసుకొని ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు సమాచారం.

పంట పరిపక్వతపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

నవ భారత్ కంపెనీ ఆయిల్ ఫామ్ రైతులకు గెలలు నరికే సమయంలో పంట పరిపక్వతపై అవగాహన కల్పించాలని జంగారెడ్డిగూడెం ఆయిల్ ఫామ్ కంపెనీ రైతు సంఘం అధ్యక్షులు ఆచంట సూర్యనారాయణ కోరారు. మండలంలోని మక్కినవారిగూడెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవ భారత్ కంపెనీ రైతులు విక్రయిస్తున్న పంటకు ప్రస్తుతం 14 రోజులకు అందిస్తున్న నగదు వారం రోజుల్లో చెల్లించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఆయిల్ ఫామ్ రైతు సంఘం సభ్యులు గెడా శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక దృఢత్వం

జీలుగుమిల్లి : ప్రతిరోజు క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంచుకోవచ్చని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్ తెలిపారు. మండలంలోని పి.అంకంపాలెంలో ఉపాధి హామీ పని ప్రదేశంలో కూలీలతో కలిసి యోగా చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఎపిఒ జాన్ వెస్లీ, పంచాయతీ కార్యదర్శి పద్మజ, ఫీల్డ్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.

దుప్పట్లు, దుస్తుల పంపిణీ

కొయ్యలగూడెం : సామాజిక సేవను బాధ్యతగా తీసుకోవాలని సురక్ష హాస్పిటల్ అధినేత కొండముది శ్యామల దిలీప్ అన్నారు. సురక్ష హాస్పిటల్ ఆధ్వర్యంలో వృద్ధులకు, వితంతువులకు, అనారోగ్యంతో ఉన్న బాధితులకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. తమ ఆసుపత్రిలో ఆటోవాలాలకు, రిక్షా పుల్లర్స్‌కు, వారి కుటుంబాలకు కూడా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

కిశోరి వికాసం 2.0 ర్యాలీ

కొయ్యలగూడెం : కిశోరి వికాసం 2.0 కార్యక్రమం వల్ల ప్రజల్లో అవగాహన పెరుగుతుందని, తద్వారా కిశోరి బాలికలకు వ్యక్తిత్వ వికాసం పెరుగుతోందని ఎంపిడిఒ కిరణ్ కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అంబటి సరస్వతి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కిశోరీ వికాసం 2.0 ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ అధికారులు, సిబ్బంది, ఐసిడిఎస్ అధికారులు, కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.